క్లుప్తంగా

రేపటి నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ కల్పన నిమిత్తం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 8 వరకు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. టెన్త్ ఆపైన చదువుకుని, 15–45 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ -35, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ -35 పోస్టులకు రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, మార్కుల జాబితా ఫొటోస్టాట్, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు రామకృష్ణారెడ్డి ఇందూరి- 8074393466 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ కోల్డ్ స్టోరేజ్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గొల్లపల్లి అనిల్ కుమార్ (22) సత్తెనపల్లిలోని ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. నందిగామలో మృతి చెందిన బంధువు అంత్యక్రియలకు హాజరై, తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. అనిల్ కుమార్ అపస్మారకస్థితికి చేరడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు దానియేలు, రాహేలు కన్నీటి పర్యంతమయ్యారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పెదకూరపాడు : స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ మాట్లాడుతూ దేశభక్తి కలిగిన పింగళి వెంకయ్య అడుగుజాడల్లో నేటి యువత నడవాలని సూచించారు. భారతదేశ జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

క్రోసూరు: మండలంలోని విప్పర్లలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి 10 వ తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 5వ తేదీన వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆమె సూచించారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పూర్తి ఫీజు రూ.4,700, కౌన్సెలింగ్ ఫీజు రూ.1100 చెల్లించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు అయితే రూ.350 చెల్లించాలన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని తెలిపారు. వివరాలకు 9490185104ను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఆశ్రమానికి ఆరు సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీలో గల అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమానికి పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఆకి రామాంజనేయులు, ఆకి వెంకటేశ్వర్లు ఆరు సీలింగ్ ఫ్యాన్‌లను శనివారం బహూకరించారు. ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి

క్రోసూరు: వినుకొండలో ఈనెల 7,8 తేదీల్లో జరిగే సీపీఐ రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. మహాసభకు సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు హాజరువుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి పసుపులేటి యాదగిరి, నాగరాజు, వేణు పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు

- కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి
- సత్తెనపల్లి 8వ వార్డ్ లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' ప్రచారం



పట్టణంలోని 8వ వార్డులో మహిళకు క్యూఆర్ కోడ్ అందిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసానికి మారుపేరని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 8వ వార్డులో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వ హించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ భార్గవ్‌రెడ్డితో కలిసి వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలను గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీలు ఇస్తారే తప్పా... వాటిని అమలు చేయరని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని మంత్రి అచ్చెయనాయుడు అనడం సిగ్గుచేటన్నారు. హామీలు ఇచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా ?అని ప్రశ్నించారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్ల నిండిన బీసీలకు పింఛను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా నిర్వహించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని, ఆయనతో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయిన ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక చతికలబడిందన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని దుయ్య బట్టారు.వార్డులో ఇంటింటికీ క్యూఆర్ కోడ్ అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గంగారపు అనూష, బీసీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మీరాన్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారపు శివనాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 8వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల, పార్టీ నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు , గుజ్జర్లపూడి సతీష్, గుజ్జర్లపూడి నిరంజన్ ప్రకాష్, గుజ్జర్లపూడి కృపావరం, అచ్యుత శివప్రసాద్,తుమ్మల వెంకటేశ్వరరావు, తిరుమల, జొన్నలగడ్డ ఆనంద్, చుక్కా మోషే, అంకాళ్ల వెంకటేశ్వర్లు, సందెపోగు గాంధీ, వల్లెం నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను నిలువునా మోసం చేసిన చంద్రబాబు

బయ్యవరం(క్రోసూరు): కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలువునా మోసం చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. , ప్రజలు కూడా మోసపోయామని తెలుసుకున్నారని చెప్పారు. మండలంలోని బయ్యవరంలో శనివారం 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమంలో నేతలు ఇంటింటికీ వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏవిధంగా ప్రజలను మోసం చేసిందో వివరించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ హామీలు అడ్రస్ లేవని తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రకాల భారాల పేదలపై మోపారని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అడ్రస్ లేదన్నారు. ఏడాది మూడు వంట గ్యాస్ సిలిండర్లు కొంతమందికే అందాయని తెలిపారు. తల్లికి వందనంలో కొంతమంది తల్లులకు అన్యాయం చేసినట్లు విమర్శించారు. రైతులకు ఒక్కసారే రూ.20 వేలు వేస్తామని చెప్పి, ఏడాది ఎగవేశారన్నారు. 14 నెలల తరువాత విడతల వారీగా అంటూ కేంద్రం వాటా రూ.2వేలతో కలిపి రూ.7 వేలు మాత్రమే వేసినట్లు తెలిపారు. ఈ విధంగా అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని తెలిపారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ప్రజలంతా జగనన్న వెంట నడిచి వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, ఎస్సీఎస్టీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గార్లపాటి దాసు, ప్రచార కమిటీ కన్వీనర్ తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అన్వర్, శాఖమూరి ఏడుకొండలు, కొతారు వెంకట్రావు, కడియం రామారావు, కాశియ్య, కోనంకి గురునాథం, కడియం పుల్లారావు, కన్నారావు, ఇషాక్, రాంబాబు, చలమయ్య,తులం శివ, నాగేశ్వరరావు, బుర్రి వెంకట్రావు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందించి అవగాహన కల్పిస్తున్న నాయకులు.

దేశంలోనే మాస్ నాయకుడు వైఎస్.జగన్

వైఎస్సార్ సీపీ ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



మాట్లాడుతున్న అవినాష్

సత్తెనపల్లి: దేశంలోనే మాస్ నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్న విషయం కూటమి ప్రభుత్వం తెలుసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు.
రెంటపాళ్ల ఉప సర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు జూన్ 18న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారు. ఆ సమయంలో పర్యటనను అడ్డు కునేందుకు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించటమే కాక అనేక మందిపై అక్రమ కేసులు బనాయించారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసులో విచారణ అనంతరం అవినాష్ మాట్లాడారు. ఏ కార్యక్రమంలోనైనా మనిషి పాల్గొనే హక్కు భారత రాజ్యాంగంలో ఉందన్న విషయం కూటమి నాయకులు తెలుసుకోవాలని ఆయన సూచించారు. సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతా రహస్యమే !

- మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం
- ఖాళీగా దర్శనమిచ్చిన సమావేశ మందిరం



మండల సర్వసభ్య సమావేశంలో ఖాళీ కుర్చీలు

ముప్పాళ్ల : మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం అంతా రహస్య ఎజెండాతో సాగింది. సమస్యలను పరిష్కరించే దిశగా సాగాల్సిన సమావేశం అధికారుల మధ్యే గుట్టుగా కొనసాగింది. ఒక్క సర్పంచ్ కూడా హాజరు కాలేదు. సమావేశానికి అవసరమైన గౌరవ సభ్యు లు హాజరు కావడంతో అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. గౌరవ సభ్యులు కూడా సంతకాలు చేసి బయటకు వచ్చి, కార్యాలయం వద్ద చెట్లు కింద కాలం వెళ్లదీశారు. సమావేశం నిర్వ హణపై మీడియాకు కూడా సమాచారం ఇవ్వలేదు. ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న అధికారిణి రూప వతి సమాచారం ఇవ్వాలని తనకు తెలియదంటూ దాట వేశారు. ఎంపీపీ మారూరి పద్మ, తహసీల్దార్ కె.నగేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.రూపవతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెడిసి కొట్టిన కూటమి నేతల కుటిల యత్నం

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానమే లక్ష్యంగా సాగిన సమావేశానికి గౌరవసభ్యులు హాజరు కావడం, సమావేశం జరగడంతో కూటమి నేతల కుటిల ప్రయత్నం బెడిసి కొట్టింది. కూటమి సభ్యులెవరూ సమావేశానికి హాజరు కాకూడదని ముందస్తుగా సమాచారమిచ్చారు. మొత్తం 12 మంది సభ్యులకు గాను 11 మంది వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన 11 మందిలో ఏడుగురు సభ్యులను ప్రలోభాలకు గురి చేసి కూటమిలో చేర్చుకున్నారు. ప్రస్తుతం ఎంపీపీగా వైఎస్సార్ సీపీకి చెందిన చాగంటివారిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు మారూరి పద్మ వ్యవహరిస్తున్నారు. ఎంపీపీ పదవిని కూటమి సభ్యులు చేజిక్కించుకునే వ్యూహంలో భాగంగా అవిశ్వాస తీర్మానానికి తెర దీశారు. అందులో భాగంగానే డివిజనల్ స్థాయి అధికారిని కలిసి నోటీసు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. అధికారిని ముప్పాళ్లలో అందుబాటులో ఉండేలా ప్రణాళిక రచించారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులకు రావద్దని కూటమి నేతలు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. అవేమి ఖాతరు చేయకుండా వైఎస్సార్ సీపీకి చెందిన గౌరవసభ్యులు సమావేశానికి హాజరు కావడం, కోరం కావడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి కూటమి నేతల వంతైంది. అధికారం కోసం పడుతున్న తాపత్రయం గ్రామాల్లోని సమస్యలపై శ్రద్ధ పెడితే బాగుంటుందనే విమర్శలు వినిపించాయి.

ఏఓగా బసవకుమారి సేవలు అభినందనీయం

- శేష జీవితాన్ని సంతోషంగా గడపాలి
- రాజుపాలెం ఎంపీడీవో సత్యనారాయణ



బసవకుమారి దంపతులకు మెమెంటోలు అందిస్తున్న ఎంపీడీఓలు

సత్తెనపల్లి: పంచాయతీరాజ్ శాఖలో ఏఓగా చిలుకూరి బసవకుమారి సేవలు ప్రశంసనీయమని రాజుపాలెం ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని మాడా విశ్వేశ్వరరావు ఫంక్షన్ హాల్లో శనివారం బసవకుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగం కత్తి మీద సాము లాంటిదని తెలిపారు. కుటుంబం కంటే వృత్తికే అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చి విధులు నిర్వహించిన బసవకుమారి ఉద్యోగులకు స్ఫూర్తి ప్రదాత అని తెలిపారు. సత్తెనపల్లి ఎంపీపీ షేక్ ఎలవర్తి పాటి జైబూన్‌బీ, సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బసవకుమారి సేవలను కొనియాడారు. అనంతరం బసవకుమారి దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాతీరాజు ఉద్యోగులు, రాజుపాలెం, సత్తెనపల్లి ఎంపీడీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



అమరావతి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా, పోలీస్ శాఖలతో పాటు ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. 80 వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో 16 వాహనాలపై కేసులు నమోదు చేశారు. 15 వాహనాలను స్వాధీ నం చేసుకుని భద్రత నిమిత్తం అమరావతి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అపరాధ రుసుంగా రూ. 44,500 వసూలు చేశారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, దీనివల్ల రోడ్లపై ప్రమాదాలను నిర్మూలించవచ్చని రవాణా శాఖ సహాయ తనిఖీ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కోటేశ్వరనాయక్, సీఐ వై.అచ్చయ్య, ఎస్ఐ కె.అమీర్ పాల్గొన్నారు.

తలసీమియా బాధితుడికి ఆర్థిక సాయం



బాలుని తండ్రి మరియదాసుకు సాయం అందిస్తున్న దాతలు

అమరావతి: మండల పరిధిలోని మునగోడుకు చెందిన కస్తల మరియదాసు కుమారుడు రత్నబాబు (6) కొంతకాలంగా తలసీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న చిలకా వంశస్తులు శనివారం మునగోడుకు వచ్చి మరియ దాసుకు రూ. 55 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా చిలకా వంశస్తుల ప్రతినిధి రాంబాబు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎంతో మంది బాధితులకు రూ.8లక్షల వరకు సాయం చేసినట్లు చెప్పారు. రత్నబాబు వైద్యానికి రూ. 2 లక్షలవరకు ఖర్చు అవుతుందని, చెన్నై ఆస్పత్రిలో ఆపరేషన్ చేయాల్సిన అవసరముందని తెలిపారు. దాతలు 8008594697 నంబరుకు ఎంత చిన్న మొత్తమైనా గూగుల్ పేద్వారా సాయందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వట్టిచెరుకూరు ఎంపీపీ సుబ్బారావు, శ్రీకాంత్ , భాస్కర్‌బాబు , మధుబాబు, జాన్సన్ , రమణయ్య, పెద్దింటి నాగేశ్వరరావు, మునగోడు సంఘ కాపరి పాస్టర్ డేవిడ్, గ్రామ సర్పంచి బంకా విష్ణు, సుందరరావు పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించండి !



సత్తెనపల్లి: అదానీ స్మార్ట్ మీటర్లు ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఐద్వా పట్టణ కమిటీ సభ్యురాలు ధరణికోట విమల పిలుపునిచ్చారు. పట్టణంలోని 21వ వార్డులో శనివారం స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సంతకాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.స్మార్ట్ మీటర్లకు వ్యతిరుకంగా ఈనెల 5న అన్ని సచివాలయాల వద్ద జరిగే ధర్నాలలో ప్రజలంతా పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. అదాని కంపెనీ సిబ్బంది స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏ బజారులో, ఏ ఇంటికి వచ్చినా అడ్డుకొని వ్యతిరేకించాలని తెలిపారు. అదానీ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.17వేలు మొత్తాన్ని 93 నెలలలో మన వద్ద వసూలు చేస్తారని ఆమె తెలిపారు. విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరుగుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, పాత మీటర్లనే కొన సాగించాలని జరిగే ఉద్యమాల్లో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు సుధ, పులిపాటి శివపార్వతి, సీఐటీయూ నాయకులు అవ్వారు ప్రసాదరావు, దామర్ల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో సీఐ నాగమల్లేశ్వరరావు తదితరులు

సత్తెనపల్లి: ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సత్తెనపల్లి టౌన్ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో శనివారం జరిగిన కృష్ణవేణి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేడుకలకు కృష్ణ వేణి జూనియర్ కళాశాల, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సత్ప్రవర్తనతో విద్యార్థులు నడుచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. దేశంలో అగ్రస్థానంలో నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, పట్టుదల లేని విద్య చుక్కాని లేని నావ వంటిదని తెలిపారు. అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో టాప్ మొదటి, రెండవ స్థానం సాధించిన విద్యార్థులు తవ్వ సాయి కౌషిక్, పఠాన్ జహీర్ ఖాన్, కొలిశెట్టి జయ సాయి కృష్ణలకు నగదు బహుమతిని అంద జేశారు. బైపీసీ గ్రూపులో పట్టణ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని షేక్ జకియా సుల్తానాకు నగదు బహుమతిని అందించారు.క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సైకాలజిస్ట్ టి.సుగంధరావు, ఎస్ఐ బి.యష్ణ, ప్రిన్సిపాల్ గంటా శ్రీనివాసరావు, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రావిపాటి శ్రీనివాసరావు (వాసు), ఫిజికల్ డైరెక్టర్ డి. మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'తో రైతులకు లబ్ధి



రైతులకు నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా



మెగా చెక్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

సత్తెనపల్లి: అన్నదాత సుఖీభవతో రైతులకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం అన్నదాత సుఖీభవ పథకాన్ని, నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని 36,672 మంది రైతులకు మంజూరైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రూ. 25.67 కోట్లు నమూనా చెక్కును పంపిణీ చేశారు. నకరికల్లు మండ లానికి చెందిన శ్రీ గోపాలకృష్ణ రైతు మిత్ర సంఘానికి సబ్సిడీపై డ్రోన్‌ను అందించారు. ముందుగా నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, పొగాకు బేళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

క్రోసూరులో.. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ మెగా చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరయ్యారు. కార్యక్రమానికి ఏడీఏ మస్తానమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వం 41,045 మంది రైతులకు రూ.28.73 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



పట్టణంలోని 3వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల

సత్తెనపల్లి: తల్లిపాల తోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. ప్రమీల అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 3వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిడ్డ పుట్టిన మరుక్షణమే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు. తల్లిపాలను మించిన తొలి పోషకాహారం ప్రపంచంలో ఏదీ లేదని చెప్పారు. తల్లిపాలు విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. హెచ్‌వీ గ్రేస్‌మేరీ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీగ్రేస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

మండలంలోని పాటిబండ్లలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెదకూరపాడు సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ పెద్దహిమాంబి మాట్లాడుతూ తల్లిపాలలో అనేక పోషకాలు ఉంటాయని వివరించారు. గ్రామంలోని తల్లులకు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వరమ్మ, రేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

మండలంలోని మాచాయపాలెం సెక్టార్‌లోని మాచాయపాలెం ఆర్‌ఆర్ గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వనజ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించాలని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాంబశివరావు, సోమ్లీ బాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

క్రోసూరులో..

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు క్రోసూరులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, మైమున్నిసా, రత్నకుమారి మాట్లాడారు. తల్లిపాల విశిష్టత తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 గణేష్, ఉపాధ్యాయులు బాబూరావు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

మండలంలోని చాగంటివారిపాలెంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను, బిడ్డకు కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పి.ప్రవల్య, ఏఎన్‌ఎం కె.వెంకటరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.శ్రీలక్ష్మి, ఎం.పద్మావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

సత్తెనపల్లి: రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, వార్డు రెవెన్యూ సెక్రెటరీలు, గ్రామ సర్వేయర్లు, చౌక దుకాణల డీలర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు, తహసీల్దారు కార్యాలయ సిబ్బంది రక్తదానం చేశారు.

దూర విద్యతో మళ్లీ చదువుకోవడానికి అవకాశం

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా రాష్ట్రంలో విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి రూపొందించిన కార్యక్రమమే దూర విద్యా విధానం అని క్రోసూరు మండల ఎంఈఓ- 2 గణేష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ సమావేశ మందిరంలో శనివారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్ కార్యక్రమం నిర్వహించారు. దూరవిద్య మండల కో-ఆర్డినేటర్ చిల్కా సురేష్ అధ్యక్షతన ఎంఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య విరామం ఇచ్చినవారు, ఉద్యోగులు, గృహిణులు, పెద్దలు మరలా కొనసాగించటానికి అవకాశం ఉందని తెలిపారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఉద్దేశాలను ప్రజలందరికీ తెలియజేసి, విద్య గురించి అవగాహన పెంపొందించాలని ఎంఈవో గణేష్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాబూరావు, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.